సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 6 । జూలై । 2025



సత్తాచాటిన డొంకేశ్వర్..

బాసర ట్రిపుల్ ఐటీ ఎంపికల్లో డొంకేశ్వర్ మండల విద్యార్థులు సత్తా చాటారు. 42 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

- 8లో ▸



విఠల విఠల

మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మండలాల్లో విఠలేశ్వరుడిని వేలాది కుటుంబాలు పూజిస్తాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.9 /23.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలన్నారు. లబ్ధిదారులకు ఐకేపీ, మెప్మా ద్వారా అవసరమైన రుణాలు మంజూరు చేయిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ ఏడాది 51.11 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం కాగా, లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పనిదినాలు, ఎక్కువ వేతనం లభించేలా చొరవ చూపాలని అధికారులకు హితవు పలికారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తూ ప్రొసీడింగ్‌లు అందజేయాలని ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైల జాయినింగ్ రిపోర్ట్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్‌కు బదిలీపై వచ్చిన ఇద్దరు ఎస్సైలు సీపీ సాయి చైతన్యకు శనివారం రిపోర్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా మావల ఎస్సైగా పనిచేసిన సయ్యద్ ముజాయిద్‌ను రెండోటౌన్‌కు, జగిత్యాల జిల్లా మేడిపల్లి ఎస్సైగా పనిచేసిన శ్యామ్‌రాజ్‌ను నందిపేటకు కేటాయించారు. కాగా, రెండో టౌన్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ పీఎస్‌కు, నందిపేట్ ఎస్సై చిరంజీవి కోరుట్లకు బదిలీపై వెళ్లారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్ట్‌లోకి 5477 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 323 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1066.60(18 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

కష్టాలు తొలగించే ఊరి దేవుళ్లు!



డొంకేశ్వర్‌లో పెద్దమ్మతల్లి బోనాలు ఎత్తుకున్న మహిళలు (ఫైల్)

ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు, నైవేద్యాల నివేదన

- నియమనిష్టలతో గంగనీళ్లతో విగ్రహాల శుద్ధి
- నాలుగు వారాల పాటు కొనసాగనున్న కార్యక్రమాలు
- పల్లెల్లో మొదలైన పండుగ వాతావరణం



వల గొడుగుతో డప్పు చప్పుల్ల మధ్య గంగనీళ్లకు వెళ్తున్న గ్రామస్తులు

సండే స్పెషల్

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆరుద్రతో ఆషాఢమాసం మొదలైంది. ఈ మాసంలో గ్రామ దేవతలను భక్తి శ్రద్ధలతో పూజిస్తే గ్రామానికి, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా సుఖశాంతులు లభిస్తాయని పల్లె ప్రజల నమ్మకం. తరతరాలుగా ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. వర్షాల కోసం గంగనీళ్లకు వెళ్లడం.. తెచ్చిన ఆ నీటితో ఊరి దేవుళ్లను శుద్ధి చేయడం అనాదిగా వస్తోంది. పస్కరాజులతో మొదలుపెట్టి తొలి ఏకాదశి వనభోజనాలు పూర్తయ్యే వరకు వారానికో క్రతువును నిర్వహించే బాధ్యతలను ప్రతి ఊరిలో ఆ ఊరి పెద్ద మనుషులే చూడడం ఆనవాయితీ. ప్రజలు జూలై నెలాఖరు వరకు గ్రామ దేవతలకు బోనాలు, నైవేద్యాలు సమర్పిస్తూ ఘనంగా పూజలు చేస్తారు. కొబ్బరికాయలు కొట్టి కోళ్లు, మేకలు కోసి మొక్కులు తీర్చుకుంటారు. రైతులు ఊరి దేవతలను మొక్కిన తర్వాతనే పంటలేస్తారు.

డప్పు చప్పుళ్లు, చేపల వలతో..

తొలకరి వర్షాలు కురవగానే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ తొలుత పస్కరాజులకు పూజలు చేస్తారు. చేపలు పట్టే వలను గొడుగు మాదిరిగా పట్టుకొని డప్పు చప్పుళ్లతో గంగనీళ్లకు వెళ్తారు. చేపల వలకు ఓ ప్రత్యేకత ఉంది. దీనికి వెయ్యి కండ్లు ఉంటాయని, ఏ శక్తి దగ్గరికి రానివ్వదని పెద్దలు చెప్తుంటారు. అందుకే వల లేకుండా గంగనీళ్లకు వెళ్లరు. పవిత్రంగా భావించే గోదావరి నీటిని గ్రామానికి తెచ్చి గ్రామ దేవతలన్నింటికీ పోసి శుద్ధి చేస్తారు. పాయసంతో చేసిన నైవేద్యం, అప్పాలు సమర్పించి అక్కడే భోజనాలు చేస్తారు. మహిళలు ప్రత్యేకంగా బోనాలు వేసి ఇంటిల్లిపాదిల్లి క్షేమంగా ఉండాలని మొక్కుతారు.

గ్రామ దేవతలు వీరే..



గ్రామ దేవతలు చాలా రకాలుగా ఉన్నారు. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, భూలక్ష్మి, ముత్యాలమ్మ, చిలుకల చిన్నమ్మ, అడెల్లి పోచమ్మ, పెద్దమ్మ తల్లి, ఐదు చేతుల పోచమ్మ, రక్త మహంకాళి, దగ్గలవ్వ, ఆయితాత, కట్ట పోచమ్మ, కట్ట మైసమ్మ, ఊరి సార్గమ్మ ఇలా గ్రామ దేవతలు ఊర్లల్లో కొలువై ఉన్నారు. ఆషాఢ మాసంలో ఈ దేవతలందరికీ ఘనంగా పూజలు చేసి బోనాలు సమర్పించడానికి ఆలయాలను, గుళ్లను ముస్తాబు చేస్తున్నారు. ఈ మాసంలో మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. రోగనిరోధక శక్తినిచ్చే మునగాకును అందరు ఎక్కువగా తింటారు.

అంతా మంచి జరుగుతుందనే..



ఆషాఢమాసం గ్రామ దేవతలకు ప్రత్యేకమని చెప్పవచ్చు. గ్రామస్తులంతా కలిసి ఊరి దేవతలను పూజిస్తాం. భక్తితో పూజిస్తే ఊరికి అంతా మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది. డొంకేశ్వర్‌లో పస్కరాజుల కార్యక్రమంతో మొదలుపెట్టి నాలుగు వారాలు గంగనీళ్లకు వెళ్తాం. ప్రతి వారం వనభోజనాలు జరుగుతాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది.

– సుంకరి నాగరాజు, డొంకేశ్వర్

నికాల్‌పూర్‌లో ముస్తాబైన గ్రామ దేవతలు



గ్రామ దేవతలే అసలైన పాలకులు..



గ్రామాలకు ఊరి దేవుళ్లే అసలైన పాలకులని చెప్పవచ్చు. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. ఈ మాసంలో దేవతలను పూజించడం వలన కష్టాలు తొలగిపోతాయని నమ్ముతారు. ఆషాఢంలో వచ్చే తొలి ఏకాదశి మహావిష్ణువుకు ఎంతో ఇష్టం.

– తిరునగరి పాండురంగాచారి, పాంచరాత్ర ఆగమ పండితులు

ప్రభుత్వ కళాశాలలకు రూ.3.23 కోట్లు



- మరమ్మతులు, కనీస వసతుల కల్పనకు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ కళాశాలల మరమ్మతులు, కనీస వసతుల కల్పనకు రూ. 3.23 కోట్లు మంజూరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ వెల్లడించారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ నిధులను రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య మంజూరు చేశారన్నారు. ఇంటర్ విద్య బలోపేతం కోసం కళాశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, కళాశాలలకు సున్నం వేయడం, కరెంటు రిపేర్లు, ఫర్నిచర్ తదితర వాటికి ఈ నిధులను వెచ్చించనున్నారు.

జూనియర్ కళాశాల	మంజూరైన నిధులు (రూ)
నిజామాబాద్(బాలికలు)	30,00,000
నిజామాబాద్(బాలుర)	56,00,000
డిచ్‌పల్లి	14,00,000
మాక్లూర్	10,00,000
మోర్తాడ్	26,35,000
వర్ని	20,50,000
బోధన్ మధుమలాంచ	10,70,000
ఆర్మూర్ (బాలికలు)	16,00,000
ఆర్మూర్ (బాలుర)	24,00,000
భీమ్‌గల్	18,00,000
ఐలాపూర్	9,00,000
బాల్కొండ	33,05,000
ధర్పల్లి	25,00,000
కోటగిరి	30,50,000

ధాన్యం సేకరణలో మనమే ఫస్ట్

- జిల్లాలో 8.40 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- బోనస్ ప్రకటనతో దండిగా వడ్లు
- 2 నెలలకుపైగా సాగిన కొనుగోళ్లు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసింది. ఒకవైపు నాట్లు వేస్తుండగా, మరోవైపు కొనుగోలు కేంద్రాలు కొనసాగాయి. ఈ సీజన్‌లో లక్ష్యానికి మించి 8.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా మొదటిస్థానంలో నిలిచింది.

రూ.1949 కోట్ల విలువైన ధాన్యం

జిల్లావ్యాప్తంగా 606 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,15,996 మంది రైతుల నుంచి 8,40,144 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. రూ.1949.09 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందులో 7,38,662 మెట్రిక్ టన్నులు సన్నరకం కాగా, 1,01,481 మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలు ఉన్నాయి. రూ.1948 కోట్ల ధాన్యం డబ్బులను 1,15,945 రైతుల ఖాతాల్లో జమచేశారు. గత వానాకాలం సీజన్‌లో 4,19,597 మెట్రిక్ టన్నులు కాగా, గతేడాది యాసంగి సీజన్‌లో 4,28,214 మెట్రిక్ టన్నులు సేకరించారు. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసి మొదటిస్థానంలో నిలిచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తర్వాతి స్థానాల్లో నల్గొండ, సూర్యాపేట్, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి.

బోనస్ ప్రభావంతోనే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సన్నరకాలను ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. వానాకాలంలో సన్నవడ్లు పండించిన రైతులకు బోనస్ డబ్బులు జమచేశారు. యాసంగిలోనూ బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్నరకాల సాగు పెరగడమే కాకుండా, బయట వ్యాపారులకు విక్రయించలేదు.

అధికారుల ఉరుకులు.. పరుగులు

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ అధికార యంత్రాంగం ఉరుకులు.. పరుగులు పెట్టింది. మొదట్లో ధాన్యం సేకరణ సాఫీగా సాగినా.. మిల్లర్లకు సామర్థ్యానికి మించి కేటాయింపులు, నిండుకున్న గోదాములు, మరోవైపు వర్షం, తరుగు, ధాన్యం రవాణా సమస్యలతో అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రధానంగా తడిసిన ధాన్యం సేకరణతో తలలు పట్టుకున్నారు. రెండు నెలలకు పైగా కొనుగోళ్లు చేపట్టడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. మరోవైపు తరుగు పేరుతో మిల్లర్లు విపరీతంగా దోచుకున్నారనే ఆరోపణలున్నాయి.

సాఫీగా ముగిసిన కొనుగోళ్లు



జిల్లాలో రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోలు చేశాం. సేకరణ ప్రక్రియ సాఫీగానే ముగించాం. 8,40,144 మెట్రిక్ టన్నులు సేకరించడమంటే ఆషామాషీ కాదు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పూర్తిచేశాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

నత్తనడకన అమృత్ 2.0

- యూజీడీ, తాగునీటి కోసం రూ. 379 కోట్లు మంజూరు
- 18 వాటర్ ట్యాంక్‌ల్లో నాలుగింటి పనులే ప్రారంభం
- నెమ్మదిగా సాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు
- పనుల పూర్తికి మరో ఏడాది పట్టే అవకాశం



న్యాల్‌కల్‌రోడ్డులో డ్రెయినేజీ కనెక్షన్ పనులు



కాలూరులో పునాది స్థాయిలోనే నిలిచిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

సాక్షి ఫోకస్

కార్పొరేషన్ కహానీ - 5

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. పట్టణాల్లో ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి నిజామాబాద్ నగరాన్ని ఎంపిక చేసి రూ.379 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. వీటిలో యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ)కి రూ. 162 కోట్లు, తాగునీటి వ్యవస్థకు రూ. 217 కోట్లు కేటాయించింది. అమృత్ 2.0 పనులు అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా జనవరి నెలలో పైలాన్‌ను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న మెగా కంపెనీ పనులు ప్రారంభించారు. పబ్లిక్ హెల్త్ విభాగం పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. అమృత్ 2.0 పనులు పూర్తిచేసిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

పిల్లర్ల దశలోనే..

నగరంలో తాగునీటి సరఫరా కోసం 5 లక్షల లీటర్ల కెపాసిటీతో 18 పెద్ద వాటర్ ట్యాంక్‌లు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు వేశారు. కాలూరు, ఖానాపూర్, సారంగాపూర్, గూపన్‌పల్లి, ముబారక్ నగర్, పాంగ్రా వంటి విలీన గ్రామాలతోపాటు నగరంలోని నాందేవ్‌వాడ, అర్సపల్లి, మాలపల్లి వంటి ప్రాంతాలను గుర్తించారు. ఇందులో 4 వాటర్ ట్యాంక్‌లు నిర్మించేందుకు స్థలాలను ఎంపిక చేశారు. నాలుగు నెలల క్రితం కాలూరు, ఖానాపూర్, నాందేవ్‌వాడలలో పనులు ప్రారంభించి, పునాదులు వేసి వదిలేశారు. గూపన్‌పల్లిలో ఎంపిక చేసిన స్థలాన్ని మార్చారు. మళ్లీ కొత్త ప్రదేశాన్ని ఎంపిక చేయలేదు. నాందేవ్‌వాడలోని పాత వాటర్ ట్యాంక్‌ను కూల్చి ఆ స్థలంలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఇది కూడా పిల్లర్ల దశలోనే ఉంది. మిగతా వాటి పనులు ఇంకా ప్రారంభించలేదు.

సా...గుతున్న యూజీడీ పనులు

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఇందూరువాసుల చిరకాల వాంఛ. ఈ కల కలగానే మిగిలిపోతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి డీ శ్రీనివాస్ అంకురార్పణ చేసిన యూజీడీ పనులు 20 ఏళ్లు గడిచినా ముందుకు సాగడం లేదు. బీఆర్ఎస్ హయాంలో కొంతమేర పెద్ద డ్రెయినేజీ మార్గాలు తవ్వి, పైపులైన్లు వేసి వదిలేశారు. ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అమృత్ 2.0 పథకం ద్వారా యూజీడీ పనులు కొనసాగిస్తున్నారు. కాలనీల్లోంచి పైపులైన్లు, వాటికి కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు సాగుతున్నాయి. నగరంలో 145 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు జరగనున్నాయి. పనులు 2026 ఆగస్టు వరకు కొనసాగనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

ప్రారంభించి వదిలేశారు

మా గ్రామానికి సరిపడా తాగునీరు లేవు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పెద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం ఇచ్చాం. ట్యాంక్ కోసం పెద్ద గుంత తవ్వారు. నెల రోజులు పనిచేసి మధ్యలోనే వదిలేశారు. యూజీడీ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు.

– ముస్కె సంతోష్, కాలూరువాసి

యూజీడీ పనులు ఆగిపోయాయి

నగరంలో 13వ డివిజన్ పరిధి చాలా పెద్దది. ఇక్కడ పేదలే ఎ క్కువగా నివసిస్తుంటారు. యూ జీడీ పనులు ప్రారంభించి వదిలేశారు. వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం ఎంపిక చేసి పనులు ప్రారంభించలేదు. తాగునీటికి చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే వాటర్ ట్యాంక్ నిర్మించాలి.

– అక్బర్ నవాజుద్దీన్, మైనార్టీ నాయకుడు, సారంగాపూర్

పనులు సాగుతున్నాయి

నిజామాబాద్ నగరంలో అమృత్ 2.0 పనులు సాగుతున్నాయి. పలు డివిజన్లలో వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నాం. 18కి గాను ప్రస్తుతం 4 వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నాం. యూజీడీ పనులు కూడా సాగుతున్నాయి. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నాం.

– నాగేశ్ రెడ్డి, డీఈ, పబ్లిక్ హెల్త్

మరో ఏడాది పడుతుంది

అమృత్ 2.0 పనులకు కేంద్రం నుంచి రూ. 379 కోట్లు మంజూరయ్యాయి. పనులు గుర్తించాం. 18 కొత్త వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నాం. యూజీడీ పనులు సాగుతున్నాయి. 7,500 కి.మీ మేర కొత్త పైపులైను పనులు సాగుతున్నాయి. పనుల పూర్తికి మరో ఏడాది సమయం పడుతుంది.

– తిరుపతి కుమార్, ఈఈ, పబ్లిక్‌హెల్త్

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, వేదికపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, సభ్యులు, అదనపు కలెక్టర్లు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- సబ్‌ప్లాన్ నిధులు వాటా మేరకు వెచ్చించాలి

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్యలతో కలిసి అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, వివిధ శాఖల ద్వారా వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పెట్టకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగం అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించాలని, కార్యక్రమంలో తహసీల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. మూడు నెలలకోసారి డీవీఎంసీ సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. పదోన్నతుల్లో సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురిచేసే వారిపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్యను కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, జిల్లా అధికారులు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి రజిత, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ మాజీ చైర్మన్



మాక్లూర్/నిజామాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును శనివారం నిజామాద్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్లు దాదన్నగారి విఠల్‌రావు, దఫేదార్ రాజు, కామారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబుద్దీన్ కలిశారు. త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే అధికంగా గెలుస్తారని కేటీఆర్ చెప్పినట్టు వారు తెలిపారు. ఇప్పటి నుంచే పార్టీ కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఆయన సూచించారని విఠల్‌రావు వెల్లడించారు.

పార్థి గ్యాంగ్‌పై పీడీ యాక్టు నమోదు

కామారెడ్డి క్రైం: తరచుగా దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న పార్థి దొంగల ముఠాపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం జారీ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని చోండా అలియాస్ కూలీ పవార్ జాకీ గుజ్జియా భోంస్లే, హరీష్ పవార్ అలియాస్ హర్ష, అనురాగ్ రత్నప్ప భోంస్లే పార్థి తెగకు చెందిన అంతర్రాష్ట దొంగల ముఠా సభ్యులు. ఈ ముఠా కామారెడ్డి, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల పరిధిలోగల జాతీయ రహదారుల వెంబడి 9 చోట్ల దారిదోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డారు. మారణాయుధాలతో రోడ్ల వెంబడి ఆగి ఉన్న వాహనాలను,అందులోని వ్యక్తులను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతుండేవారు. దీంతో శాంతి భద్రతల దృష్ట్యా వారిపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్ శనివారం నిజామాబాద్ సెంట్రల్ జైలుకు వెళ్లి అక్కడి జైలు అధికారులకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు.

ఎస్సైల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ఎస్సైలను బదిలీలు చేస్తూ సీపీ పోతరాజు సాయిచైతన్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 14 మంది ఎస్సైలను బదిలీ చేయగా ఏడుగురికి పోస్టింగ్ ఇచ్చి మరో ఏడుగురిని వీఆర్‌కు అటాచ్ చేశారు. పోస్టింగ్‌లు ఇలా.. మామిడిపల్లి కళ్యాణి-సిరికొండ), సుస్మిత-మోపాల్), ముత్యాల రమ-ఎడపల్లి), కావల్లా శైలేందర్-బాల్కొండ, జాదవ్ సుహాసిని-మెండోరా, పడాల రాజేశ్వర్-ఏర్గట్ల, కాల్‌మడుగు కిరణ్‌పాల్-నిజామాబాద్ త్రీటౌన్-2 బదిలీ అయ్యారు. వీరిలో నలుగురు మహిళ ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇవ్వడం జిల్లాలో మొదటిసారి. నిజామాబాద్ కమిషనరేట్‌కు ఎస్సైలు రామ్, యాదగిరి, వంశీకృష్ణ, నరేష్ బరుకుంట, ఎండీ యాసిన్ ఆరాఫత్, రాములను వీఆర్‌కు అటాచ్ చేయగా విక్రమ్‌ను ఆదిలాబాద్ వీఆర్‌కు బదిలీ చేశారు.

విఠల విఠల

- పాండురంగని దర్శనం కోసం పండరీపూర్‌కు..
- కామారెడ్డి జిల్లా నుంచి 'దిండి' పాదయాత్ర
- తొలిఏకాదశి రోజున దర్శనంతో పులకించనున్న భక్తులు
- దశాబ్దాలుగా వెళ్తున్న భక్తులు ఎందరో..
- అక్కడికి వెళ్లలేనివారు కామారెడ్డి జిల్లాలోని బైరాపూర్ గుడికి..

పుండరీకుడు తన తల్లిదండ్రులకు చేస్తున్న సేవను చూస్తూ ముగ్ధుడైన ఆ మహావిష్ణువు (పాండురంగడు) రెండు చేతులు నడుముకు పెట్టుకుని ఇటుకపై అలానే నిల్చుండిపోయాడు. విఠోబ.. విఠలేశ్వరుడు.. పాండురంగడు ఏపేరుతో పిలిచినా స్వామి పలుకుతాడని భక్తుల నమ్మకం. ఆ నమ్మకమే ప్రతి ఏడాది భక్తులను పండరీపురానికి నడిపిస్తోంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా కామారెడ్డి జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో 'దిండి'గా తరలివెళ్లారు.



పండరిపూర్‌కు వెళ్తున్న మద్నూర్‌కు చెందిన భక్తులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో విఠలేశ్వరుడిని వేలాది కుటుంబాలు పూజిస్తాయి. వారంతా ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున విఠలేశ్వరుడిని దర్శించుకుంటారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌లో కొలువైన విఠలేశ్వరుడు, రుక్మిణీదేవి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివెళ్తారు. ఉమ్మడి జిల్లాలోని మద్నూర్, జుక్కల్, డోంగ్లీ, పెద్ద కొడప్‌గల్, నిజాంసాగర్, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, గాంధారి, కోటగిరి, రుద్రూ ర్, వర్ని, పాతంగల్, బోధన్ తదితర మండలాల నుంచి ఏటా తొలి ఏకాదశికి పక్షం రోజుల ముందుగానే వేలాది మంది 'దిండి'పేరుతో పాదయాత్రగా బయలుదేరి వెళ్తారు. 320 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల మేర పాదయాత్రగా వెళ్లి దర్శనం చేసుకుంటారు. వేలాది మంది రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లి తొలి ఏకాదశి రోజు పండరీపూర్‌కు చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. దారి పొడవునా స్థానికులు 'దిండి'గా వెళ్తున్న భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తారు. మరి కొందరు వాహనాల్లో వెళ్తారు.

స్వామికి ఇంట్లోనే ఆలయం



మద్నూర్ మండల కేంద్రానికి చెందిన వట్నల్‌వార్ కృష్ణ, రుక్మిణీ దంపతులు పండరీపూర్ విఠలేశ్వరుని భక్తులు. ఏడాది క్రితం నూతన ఇంటిని నిర్మించుకున్న సమయంలో ఇంట్లో విఠలేశ్వరుడికి గుడి కట్టించుకున్నారు. నిత్యం స్వామివారికి వస్త్రాలంకరణసేవ, నైవేద్యం, అర్చనలు చేస్తారు. తొలి ఏకాదశి రోజున పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. పండరిపూర్ ఆలయంలో కొనసాగే పూజావిధానా న్నే తన ఇంట్లోని ఆలయంలో పాటిస్తారు.

బైరాపూర్‌లో విఠలేశ్వరుడు

నస్రుల్లాబాద్ మండలం బైరాపూర్‌లో కొలువైన విఠలేశ్వరస్వామి ఆలయానికి కూడా తొలి ఏకాదశి రోజున వేలాది మంది భక్తులు తరలివస్తారు. పండరిపూర్‌కు వెళ్లలేని వాళ్లంతా ఇక్కడికి వచ్చి దర్శనం చేసుకుంటారు. దర్శనానికి వచ్చిన భక్తులకు స్థానిక ఆలయ నిర్వాహకులు అన్నదానం చేస్తారు. తొలి ఏకాదశి రోజున బైరాపూర్ ఆలయం జనంతో కిక్కిరిస్తోంది.

విఠలేశ్వరుడి అనుగ్రహంతోనే..



ప్రతి ఏడాది పండరిపూర్‌లోని విఠలేశ్వరుడిని దర్శించుకుంటా. కొన్నేళ్లుగా విఠలేశ్వర స్వామి వద్దకు వెళ్లి రావడం జరుగుతోంది. మాకు విఠలేశ్వరుడే అన్నీ. స్వామిని నమ్ముకున్నోళ్లకు ఏలోటు ఉండదు. అంతా స్వామిదయ. ఇరవై ఐదేళ్లుగా వెళ్తున్నా.

– సంగాయప్ప స్వామి, మద్నూర్

ఇరవై ఏళ్లుగా వెళ్తున్నా..



ఇరవై ఏళ్లుగా ప్రతి ఏడాది పండరిపూర్ కు పాదయాత్రగా వెళ్తున్నా. విఠలేశ్వరుని అనుగ్రహంతో శక్తి ఉన్నన్ని రోజులు ఏటా తొలి ఏకాదశికి చేరుకునేలా పాదయాత్రగా వెళ్లి వస్తూనే ఉంటా. వేలాది మంది మా ప్రాంతం వాళ్లు పండరిపూర్‌కు వస్తారు.

– కౌనింటి విఠల్, బిచ్కుంద

దైవచింతనలో ఉంటాం



విఠలేశ్వరుడిని నమ్ముకున్నం. నిత్యం దైవ చింతనలో ఉంటాం. పదిహేనేళ్లుగా క్రమం తప్పకుండా పండరిపూర్‌కు వెళ్లి దర్శనం చేసుకుని వస్తున్నాను. అంతా స్వామి నడిపిస్తున్నాడు. చేతనైనన్ని రోజులు వెళ్లి వస్తూనే ఉంటా.

– వెంకట్ మహారాజ్, మద్నూర్

నాలుగు దశాబ్దాలుగా వెళ్తున్నా



నేను సుమారు 41 ఏళ్లుగా పండరిపూర్‌కు వెళ్తున్నాను. విఠలేశ్వరుడి అనుగ్రహంతో ఇప్పటికీ క్రమం తప్పకుండా వెళ్లి వస్తున్నాను. అంతా స్వామి దయ. ప్రతి ఏడాది వెళ్లి వస్తాను. నాతోపాటు మా ఊరి వాళ్లు చాలా మంది వస్తారు.

– దార్వల్ సాయిలు, బిచ్కుంద

యూరియా కొరత సమస్యను పరిష్కరించాలి



దినేష్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: జిల్లాలో నెలకొన్న యూరియా కొరత సమస్యను పరిష్కరించి, రైతులకు సరిపడా అందుబాటులో ఉంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి లేఖ ద్వారా విన్నవించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. జిల్లాలో 75వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు కేవలం 25,580 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతులకు సరఫరా చేశారన్నారు. ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, రైతులు అడ్డగోలు ధరలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే యూరియా కొరత లేకుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని దినేష్ కలెక్టర్‌ను కోరారు.

రెండు దుకాణాల్లో చోరీ

సిరికొండ: మండల కేంద్రంలోని రెండు కిరాణ దుకాణాల్లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. దుకాణాల నిర్వాహకులు శనివారం ఉదయం దుకాణం తెరవడానికి వెళ్లేసరికి తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయని తెలిపారు. ఒక దుకాణంలో రూ.ఇరవై వేల నగదు, సామగ్రి, మరో దుకాణంలో రూ.18వేల నగదు సామగ్రి చోరీ అయినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై రామ్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లికి చెందిన ఓ మహిళను మోసం చేసిన అస్మత్ ఖాన్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ శనివారం తెలిపారు. అస్మత్ ఖాన్, గ్రామానికి చెందిన సదరు యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అతడు పెళ్లి చేసుకుంటానని తెలపడంతో శారీరకంగా దగ్గరయ్యారు. చివరకు ఆమె గర్భం దాల్చడంతో మాటమార్చాడు. దీంతో బాధిత మహిళ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ శనివారం తెలిపారు. మహారాష్ట్రకు చెందిన గోల్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పలువురితో మట్కా ఆడుతూ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిస్తుండగా పోలీసులు ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రెండు లారీలు ఢీ: ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపైగల రామారెడ్డి బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి ఓ లారీ సర్వీస్ రోడ్డులోకి వెళ్లి రివర్స్ తీసుకుంటుండగా నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓంకారం పార్టీ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. అఖిలేష్, మహేష్ అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. గాయపడిన వారిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడు..



నరేశ్ మృతదేహం

నందిపేట్/డొంకేశ్వర్: పొలం దమ్ము చేస్తుండగా కేజ్‌వీల్స్ ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నందిపేట్ మండలం శాపూర్ శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన అవుట్ల నరేశ్(36) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈ నెల 4న సాయంత్రం అతడు శాపూర్ శివారులోని అల్లూరి ప్రదీప్ రెడ్డికి చెందిన పొలాన్ని దమ్ము చేయడానికి వెళ్లాడు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న నరేశ్ బురదలో పడిపోగా కేజ్‌వీల్ అతని పైనుంచి వెళ్లింది. వెంటనే స్థానికులు గమనించి వచ్చి చూసేసరికి నరేశ్ మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నరేశ్ భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసున్నామని ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. నగరంలోని పూలాంగ్‌కు చెందిన మల్లెపూల సందీప్(36), రవికుమార్ కలిసి కార్పెంట్ షాపు నిర్వహించగా నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు కలగడంతో సందీప్ మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం చెదల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడు భార్యకు సమాచారం అందించడంతో వెంటనే కుటుంబసభ్యులు అతడిని గుర్తించి, చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

భర్తపై భార్య దాడి

- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి



దేశ్య నాయక్ (ఫైల్)

బోధన్‌రూరల్: భర్తపై భార్య దాడి చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బోధన్ మండలంలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మినార్‌పల్లి గ్రామానికి చెందిన దారావత్ దేశ్య నాయక్ (57) కొంతకాలంగా వ్యసనాలకు బానిసై ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ విషయంలో అతడి భార్య సాలు బాయి, కొడుకు వసంత్‌ల మధ్య తరచూ గొడవలు వస్తుండేవి. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం దేశ్య నాయక్‌పై భార్య సాలు బాయి బలమైన ఇనుపరాడుతో దాడికి పాల్పడింది. ఈ ఘటనలో దేశ్య నాయక్ తీవ్రంగా గాయపడగా స్థానికులు, కొడుకు అతడిని చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రి తరలించగా, రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న కొడుకు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హత్యలో మృతుడి భార్యతో పాటు కొడుకు హస్తం కూడ ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొనగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి శనివారం తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థినులకు అస్వస్థత



వర్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు


రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో గల ఆదర్శ కళాశాల (మోడల్ స్కూల్/కళాశాల)లో పలువురు విద్యార్థినులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వారంతా రాత్రివేళ ఒక్కసారిగా వాంతులు చేసుకుంటూ అస్వస్థతకు గురికావడంతో కేర్ టేకర్ సుజాత రుద్రూర్ పీహెచ్‌సీ సమాచారం అందించారు. మండల వైద్యాధికారిణి అయేషా సిద్ధికా, ఆరోగ్య సిబ్బంది హాస్టల్‌కు చేరుకుని ప్రథమ చికిత్స నిర్వహించారు. సుమారు 95మంది విద్యార్థినులు కడుపునొప్పితో ఇబ్బంది పడ్డారు. తీవ్ర అస్వస్థతతకు గురైన 8మంది విద్యార్థినులను వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. శనివారం సాయంత్రం నలుగురిని డిశ్చార్జ్ చేసినట్టు వైద్యాధికారిణి వెల్లడించారు. ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన ఐరన్ మాత్రలను తినకముందు వేసుకోవడం వల్ల అస్వస్థత గురైనట్లు ఆమె వివరించారు.

చోరీ కేసులో నగలు, నగదు రికవరీ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఇటీవల ఓ చోరీ జరుగగా, నిందితుడిని పట్టుకొని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వినోద్ తెలిపారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ధర్మారం(బి) గ్రామానికి చెందిన ఖాత రజిత గత నెల 30న ఇంటికి తాళం వేసి, వేరే ఊరికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయాన్నే ఇంటికి వచ్చిన రజిత తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం అనుమానాస్పదంగా కనిపించిన గ్రామానికి చెందిన చెండేటి రాజు (పెయింటర్)ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా చోరీ తానే చేసినట్లు అంగీకరించాడు. అనంతరం అతడి వద్ద నుంచి చోరీ సొత్తు బంగారు ఆభరణాలు (2 జతల కమ్మలు, ఒక పాపిట బిల్ల, జత బుట్ట కమ్మలు, బంగారు గొలుసు, తులం ముద్ద బంగారం (సుమారు 30 గ్రాములు), వెండి పట్టగొలుసులు (100 గ్రాములు)తో పాటు రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

గ్రామ కంఠం అంటే..

మీకు తెలుసా?



బాల్కొండ: గ్రామ కంఠం అనేది ఒక గ్రామంలో నివాసాల కోసం కేటాయించిన భూమిని తెలియజేస్తుంది. గ్రామంలోని ఉమ్మడి స్థలం. ఈ స్థలంలో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించబడుతాయి.

- గ్రామ కంఠం భూమిని వారసత్వంగా అనుభవించాల్సిందే తప్ప ఇతరులకు అమ్మడం, లేదా బదలయించడం కుదరదు.
- భూమిలో నివసించే ప్రజలకు ఆ భూమిపై పూర్తి హక్కులు ఉండవు. కాని వారు దానిని అనుభవించవచ్చు.
- గ్రామ కంఠం భూమిని ప్రభుత్వం అవసరమైతే స్వాధీనం చేసుకుంటుంది. లేదా ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటుంది.
- గ్రామ కంఠం భూములను రెవెన్యూ శాఖ నిర్వహిస్తుంది. అవసరమైన పత్రాలను జారీ చేస్తుంది.

సెల్‌ఫోన్‌లోనూ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ దరఖాస్తు

సమాచారం..



కమ్మర్‌పల్లి: వాహనం నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) తప్పనిసరి. అయితే చాలామంది దానిని రెన్యూవల్ చేయించుకోవడం మర్చిపోతుంటారు. గడువు తీరిన 30 రోజుల్లోపు రెన్యువల్ చేయించుకోవాలి. అలా చేయకుండా ఏడాది దాటితే తిరిగి కొత్తగా తీసుకోవాలి. రెన్యూవల్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లకుండా సెల్‌ఫోన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. లైసెన్స్ తీసుకున్నప్పుడు ఉపయోగించిన సెల్ నంబర్‌తోనే రెన్యూవల్ చేసుకోవాలి.

- రవాణాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి లైసెన్స్ ఆప్షన్‌పై నొక్కాలి. తర్వాత రెన్యువల్ ఆఫ్ డ్రైవింగ్ లైసెన్స్‌పై క్లిక్ చేసి, క్లిక్ హియర్ టు బుక్ ది స్లాట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- దీంతో మరో కొత్త విండోలో ఆన్‌లైన్ సేవలు కనిపిస్తాయి. కింద వచ్చిన బాక్స్‌లో డీఎల్ నంబర్, పొందిన ప్రాంతం, జనన తేదీ, సెల్ నంబర్లను పూరించాలి. రిక్వెస్ట్ ఓటీపీపై క్లిక్ చేస్తే సెల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- తర్వాత క్యాప్చాని ఎంటర్ చేసి గెట్ డీటెయిల్స్‌పై క్లిక్ చేయగానే మనం నింపిన వివరాలు అన్ని స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించి కన్ఫర్మ్‌పై నొక్కాలి.
- మరో విండోలో తేదీని ఎంచుకొని నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి. చెల్లించాల్సిన డబ్బులను చెల్లిస్తే స్లాట్ బుకింగ్ పూర్తవుతుంది.
- వీటన్నింటిని ప్రింట్ తీసుకొని ఎంచుకున్న తేదీన ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లాలి. అధికారులు అన్నీ పరిశీలించి సరిగా ఉంటే ఆ వ్యక్తిని ఫొటో తీసి రెన్యూవల్ లైసెన్స్ జారీ చేస్తారు.

సత్తాచాటిన డొంకేశ్వర్ విద్యార్థులు

- మండలం నుంచి 42 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక
- ఒక్క పీఎంశ్రీ జెడ్పీ పాఠశాల నుంచే 27 మంది అర్హత



డొంకేశ్వర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

డొంకేశ్వర్(ఆర్మూర్): బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికల్లో డొంకేశ్వర్ మండల విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మెరిసిన పలువురు మండల విద్యార్థుల్లో 42మంది బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇందులో అత్యధికంగా మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 27 మంది ఎంపిక కాగా, ఇది రాష్ట్ర రికార్డు అని ఉపాధ్యాయులు చెప్తున్నారు. అలాగే తొండాకూర్ జెడ్పీ స్కూల్ నుంచి తొమ్మిది మంది, నికాల్‌పూర్ జెడ్పీ స్కూల్ నుంచి ఐదుగురు, గాదేపల్లి నుంచి ఒక్కరు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

రికార్డులు సృష్టిస్తున్న డొంకేశ్వర్ పాఠశాల..

మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాల రికార్డులు సృష్టిస్తోంది. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరుశాతం ఫలితాలను రాబట్టడమే కాకుండా రాష్ట్ర, జిల్లాస్థాయిలో ర్యాంకులను సొంతం చేసుకుంది. ఎస్సెస్సీలో తోట రక్షిత అనే విద్యార్థిని 586 మార్కులు సాధించింది. మొత్తం 74మంది విద్యార్థులకు గాను 66మంది 500లకు పైగా మార్కులు సాధించారు. ఇందులో 550కి పైగా మార్కులు వచ్చిన వారు 33మంది ఉన్నారు. ఇలాంటి అత్యుత్తమ ఫలితాల కారణంగా ఈ పాఠశాల నుంచి ఏకంగా 27మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇంతమంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాలేదు. దీంతో మరో రికార్డు డొంకేశ్వర్ పాఠశాలకు సొంతమైంది.

గర్వంగా ఉంది..



ఈ ఏడాదిలో డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్ నుంచి మంచి ఫలితాలు వచ్చాయి. పదిలో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు వచ్చాయి. ఇప్పుడు 27 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాల గర్వంగా ఉంది. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు.

–సురేశ్‌కుమార్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ డొంకేశ్వర్

తల్లి, గురువుల ప్రోత్సాహంతోనే..



అమ్మ సహకారం, గురువుల ప్రోత్సాహంతోనే పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయి. ఆ మార్కులే ఇప్పు డు నాకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చేలా చేశాయి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ట్రిపుల్ ఐటీలో కూడా బాగా చదివి ఉన్నత ఉద్యోగాన్ని సాధిస్తా.

–తోట రక్షిత, డొంకేశ్వర్

ఆనందంగా ఉంది..



నేను పేద కుటుంబం నుంచి వచ్చాను. డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్‌లో నాణ్యమైన విద్య దొరికింది. ఉపాధ్యాయులు ప్రోత్సహించడంతో పదిలో మంచి మార్కులు వచ్చాయి. తద్వారా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది.

–లక్షణ, సిర్పూర్ గ్రామం

వివాహిత ఆత్మహత్య

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా. కొడిచర్ల గ్రామానికి చెందిన మచ్కురి సుధాకర్‌కు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా బౌరల్ గ్రామానికి చెందిన మహాదేవి(28)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల మహాదేవి గర్భం దాల్చగా, పిండం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అబార్షన్ అయింది. దీంతో మహాదేవి మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి సామ్రాట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

బోధన్‌లో పరారైన ఖైదీ..

తిరుపతిలో పట్టుకున్న పోలీసులు

బోధన్: పట్టణంలోని జైళ్ల శాఖ నిర్వహిస్తున్న మై నేషన్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ పంపు)లో పని చేస్తున్న ఓ ఖైదీ ఇటీవల పారిపోగా, తిరుపతిలో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్ని మండలంలోని సైద్‌పూర్ గ్రామానికి చెందిన కాత్రోత్ జీవన్ గతంలో తన భార్యను చంపిన కేసులో నిజామాబాద్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈక్రమంలో అతడు జైళ్ల శాఖ ఆధ్వర్యంలోని పెట్రోల్‌బంక్‌లో కొన్ని నెలలుగా పని చేస్తున్నాడు. జూన్ 29న మధ్యాహ్నం పెట్రోల్ పంప్ నుంచి అతడు పరారయ్యాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, సదరు ఖైదీ తిరుపతిలో ఉన్నట్లు సమాచారం వచ్చింది. ఈమేరకు శుక్రవారం ఏఎస్సై బాబురావు, కానిస్టేబుల్స్ రవి, సాయికృష్ణ అక్కడి పోలీసుల సహకారంతో తిరుపతి దేవస్థానం ఆవరణలో అతడిని పట్టుకున్నారు. బోధన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అతడిని శనివారం తీసుకొని వచ్చిన అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ వెంకటనారాయణ వెల్లడించారు.